క్లుప్తంగా

వీల్ ఛైర్స్, రెండు స్ట్రెక్చర్స్ వితరణ



తెనాలిఅర్బన్: కల్ప వృక్ష సంస్థ ఆధ్వర్యంలో తల్లిపిల్లల వైద్యశాలకు అవసరమైన మూడు వీల్ చైర్స్, రోగులకు తీసుకువెళ్లే రెండు స్ట్రెక్చర్స్‌ను సోమవారం జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో అవసరమైన అనేక పరికరాలను దాతలు ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అమర్‌జైన్, జితేంద్ర జైన్, అభిషేక్ జైన్, ఆశా జైన్, అక్షయ్ జైన్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ యూనిట్ మలేరియా అధికారికి సన్మానం



తెనాలిఅర్బన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న తెనాలి సబ్ యూనిట్ మలేరియా అధికారి శ్రీకంఠ ఉమాకాంత్‌ను జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం సోమవారం సన్మానించి అభినందించారు. పాత ప్రభుత్వ వైద్యశాలలోని సహాయ మలేరియా అధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మలేరియా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు మంత్రి అభినందన



తెనాలిరూరల్: తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను మంత్రి నాదెండ్ల మనోహర్ అభినందించారు. జిల్లా ఉత్తమ తహసీల్దార్‌గా జిల్లా కలెక్టర్ నుంచి ఆదివారం ప్రశంసాపత్రం అందుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి మనోహర్‌ను తహశీల్దార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ద్వారా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. భవిష్యత్తులోనూ ప్రజలను ఉత్తమ సేవలందిస్తూ మరెన్నో ప్రశంసలందుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం



తెనాలి: ది తెనాలి కమీషన్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గంగానమ్మపేటలోని అసోసియేషన్ హాలులో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెండేల వెంకట్రావు అధ్యక్షత వహించారు. 2025–28 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుగ్గుల వెంకటప్పయ్య (చిన్నా), కార్యదర్శిగా అద్దంకి రామమోహనరావు, కోశాధికారిగా సామి రమేష్, ఉపాధ్యక్షునిగా భాస్కరుని ఆదిశేషారావు, సంయుక్త కార్యదర్శి సామి వెంకటేశ్వరరావు, గౌరవ సలహాదారుగా సోమిశెట్టి కొండలరావును ఎన్నుకున్నారు. వీరిని పెండేల వెంకట్రావు, అసోసియేషన్ పెద్దలు అభినందించారు.

అంకమ్మ తల్లికి డాక్టర్ గణేష్ పూజలు




చెరుకుపల్లి (రేపల్లె రూరల్): చెరుకుపల్లి మండలం తుమ్మలపాలెం పంచాయతీలోని పిట్టువారిపాలెం గ్రామంలో నెలకొన్న పిట్టువారి ఇలవేల్పు సముద్రాల అంకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం వైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా అమ్మవారిని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుండి వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యదర్శులు పిట్టు సాంబశివరెడ్డి, నిజాంపట్నం కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పిట్టు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పిట్టు సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రిపురనేని మహాగ్రంథం 'సూతపురాణము'

- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆరంభమైన శతవసంతాల సంబరాలు
- 29న గుంటూరులో వేడుకలు, త్రిపురనేని జాతీయ పురస్కారాల ప్రదానం




తెనాలిలోని త్రిపురనేని కార్యక్షేత్రం 'సూతాశ్రమం' (ఇన్‌సెట్) త్రిపురనేని రామస్వామి



సూతపురాణము కావ్యం

తెనాలి: 'హేతువాద యుగంలో కవులందరికీ ఆది పురుషుడు త్రిపురనేని రామ స్వామి చౌదరి. ఆయన సూతపురాణమొక మహాగ్రంథం. ఆయన పద్య రచనాశైలి ఎంతో మనోహరంగా ఉంటుంది. భావాలు పురాణాలకు వ్యతిరేకం. మొదట విప్లవం తెచ్చింది ఆయన' అన్న ప్రఖ్యాత కవి విశ్వనాథ సత్యనారాయణ మాటలు, భావవిప్లవ వైతాళికుడు త్రిపురనేని రామస్వామి ఎంతటి ప్రజ్ఞావంతులో వెల్లడిస్తాయి.

కవిరాజు త్రిపురనేని రామస్వామి 1925లో 'సూతపురాణము' రాశారు. ఆ మహాగ్రంథానికి ఇప్పుడు శతవసంతాలు. సాహిత్య చరిత్రలో ఒక సంచలనమైన ఈ కావ్యానికి శతవసంతాల సంబరాలు రామస్వామి జన్మదినమైన ఈనెల 15న ప్రారంభమై, ఆయన వర్ధంతి రోజైన జనవరి 16, 2026న రెండు తెలుగు రాష్ట్రాల్లో ముగుస్తాయి. ఇందులో భాగంగా బుధవారం గుంటూరులో 'సూతపురాణము శతవసంతాల వేడుక, కవిరాజు త్రిపురనేని జాతీయ పురస్కార సభ'ను నిర్వహించనున్నారు. కవిరాజు త్రిపురనేని సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆరోజు ఉదయం గుంటూరులోని జేకేసీ కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటయే సభకు సమితి గౌరవ అధ్యక్షుడు గద్దె మంగయ్య అధ్యక్షత వహిస్తారు. ఇదే సభలో సుప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ దేవరాజు మహారాజు, తెనాలికి చెందిన రచయిత, ప్రజాసాహితీ ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబును త్రిపురనేని రామస్వామి జాతీయ పురస్కారంతో సత్కరిస్తారు.

కృష్ణాజిల్లాలోని అంగలూరులో జన్మించిన రామస్వామి ముంబయిలో ప్లీడర్‌సిప్, ఐర్లండ్ రాజధాని డబ్లిన్లో బారిష్టరు చదువుకుని బందరులో ప్రాక్టీస్ ఆరంభించారు. తర్వాత విజయవాడకు, మరికొంతకాలానికి తన కార్యక్షేత్రాన్ని తెనాలికి మార్చుకున్నారు. తన ఆశయ సాధనకు తెనాలిలోని ఇంటిని సూతాశ్రమంగా మార్చారు. అది హేతువాద సమరానికి కార్యక్షేత్రమైంది. తన రచనా వ్యాసంగానికి, వికాసోద్యమానికి ఒక ఆచార్యపీఠంగా వాసికెక్కింది. అక్కడే 'సూతపురాణము' వెలువడింది.

సామాజిక రుగ్మతలను, మతమౌఢ్యాన్ని, ఛాందసవాదాన్ని, దురాచారాలను ప్రజాహితం కోసం ఎదిరించడానికే రామస్వామి తన రచనలనే ఆయుధంగా ఎంచుకున్నారు. ఆయన ప్రారంభించిన సామాజిక విప్లవం అంతటితో ముగిసినట్టు కాదు. సామాజిక సమన్యాయం నెలకొనటానికి మరెన్నో పోరాటాలు అవసరమని మన అనుభవం చెబుతోంది. అందుకు తగిన స్ఫూర్తినిచ్చేందుకు భావితరాలకు కవిరాజు సాహిత్యం అందించాలంటే సూతపురాణము కావ్యం శతవార్షికోత్సవమే కాదు...కవిరాజు ఇతర రచనలనూ నేటితరానికి అందించాలి. 'శాస్త్రములెల్ల జదివి విజ్ఞానమెరిగి/సంశయింపక సర్వథా చర్చజేసి/ నిజమెరుంగ వలయు నిది నేర్వకున్న/ మూఢవిశ్వాసమున జేటు మూడుచుండు' అన్నారు రామస్వామి. 'హేతువాద బుద్ధిని ఉపయోగించి పాతపురాణాల్ని నమ్మవద్దనీ, ప్రశ్నించి, మీ బుద్ధికి నిజమని తోస్తేనే నమ్మండి' అన్న రామస్వామి మాటలనే కాదు...నేటి సామాజిక, రాజకీయ పరిణామాలను అర్థంచేసుకుంటూ ప్రశ్నించటం నేర్పగలగాలి. అప్పుడే సూతపురాణము శతవసంతాల సంబరాలకు సార్థకత.

ఆదర్శ పట్టణంగా తెనాలిని తీర్చిదిద్దుతాం

- మంత్రి నాదెండ్ల మనోహర్
- వేర్వేరు వార్డుల్లో పాదయాత్ర



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఒకటి, రెండు వార్డులలో సోమవారం ఉదయం ఆయన పాదయాత్ర నిర్వహించారు. వీధుల్లో తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వలు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు వంటి సమస్యలపై ఆయనకు ప్రజలు ఏకరువు పెట్టారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ కొంత అధ్వాన్నంగా ఉందని, ఇప్పుడే అది మెరుగుపడుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు సబ్ కమిటీ వేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సూచించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కౌన్సిలర్లు అన్నాబత్తుని పద్మజ, గోగిరెడ్డి మానసరెడ్డి, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మిపతి, తహసీల్దార్ గోపాలకృష్ణ, హౌసింగ్ ఈఈ భాస్కర్, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు సిబ్బంది, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు వార్డులలో పాదయాత్ర

మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు 39, 40 వార్డులలో పాదయాత్ర చేయనున్నట్లు కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఐతానగర్‌లోని గోలి డొంక నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

లెప్రసీ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం



స్థానికులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: లెప్రసీ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పిలుపునిచ్చారు. పట్టణంలో జరుగుతున్న లెప్రసీ సర్వేలను సోమవారం ఆయన పరిశీలించారు. సర్వేను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద కేసులను జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. లెప్రసీపై ప్రజలందరికీ అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, సబ్‌యూనిట్ అధికారులు వంగల పున్నారెడ్డి, అందె బాలచంద్రమౌళి, శ్రీకంఠ ఉమాకాంత్, దీపాల శ్రీనివాసరావు, శివగణేష్, దాసరి నాగ మల్లేశ్వరరావు, బండారు మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెయింట్‌జాన్స్ స్కూల్ వార్షికోత్సవం



బహుమతులను అందజేస్తున్న డాక్టర్ శోభారాణి

తెనాలి: విద్యారంగంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన పట్టణ నాజరుపేటలోని సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలు 53వ వార్షికోత్సవ వేడుకలు రిపబ్లిక్ దినోత్సవమైన ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్కూల్ పూర్వవిద్యార్థి, వి-కార్డియాక్ హాస్పటల్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్, దాసరి నారాయణరావు ప్రభుత్వ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శోభారాణి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విద్యతోపాటు క్రీడలు, కళలకు సమప్రాధాన్యం ఇస్తున్న సెయింట్‌జాన్స్ స్కూల్ యాజమాన్యాన్ని ప్రశంసించారు. ఇలాంటి పాఠశాలలో విద్యార్థుల సృజనకు ఆకాశమే హద్దుగా అభిప్రాయపడ్డారు. విద్యార్థులు చదువుతోపాటు ఏదొక క్రీడ/ కళలో ప్రతిభను సాధించాలని సూచించారు. స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సూరజ్‌మోహన్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థలో విద్యార్థులు ప్రతిభావంతంగా రాణిస్తుండటం తమకెంతో గర్వకారణమన్నారు. డైరెక్టర్ అనీ అరుణలత తన ప్రసంగంలో స్కూలు విధివిధానాలను వివరించారు. స్కూలులో నర్సరీ నుండి ప్లస్‌టూ వరకు చదువుతున్న విద్యార్థుల వరకు వివిధ సాంస్కృతిక అంశాలను ప్రదర్శించి, ఆహుతులను అలరించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడాపోటీలు, సంగీతం, నాట్యం, వక్తృత్వం, క్విజ్, ఫ్యాన్సీడ్రెస్ తదితర పోటీల్లో విజేతలకు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ శోభారాణి బహుతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. చివరగా డాక్టర్ సూరజ్‌మోహన్ హాజరైన తల్లిదండ్రులు, వీక్షకులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణపై అవగాహన అవసరం

తెనాలి పశుసంవర్థక శాఖ ఉపసంచాలకురాలు వై.పద్మావతి



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఉపసంచారకురాలు వై.పద్మావతి

తూములూరు(కొల్లిపర): పాడి పశువుల సంరక్షణపై రైతులు అవగాహన పెంచుకోవాలని తెనాలి పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకురాలు డాక్టరు వై.పద్మావతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తూములూరు గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి తెనాలి పశు సంవర్ధక శాఖ ఏడి డాక్టర్ రమేష్, దుగ్గిరాల పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టరు ఆర్.అపర్ణలతో కలసి తెనాలి పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకురాలు వై.పద్మావతి పశు వైద్య శిబిరానికి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నట్టల నివారణ మందు, దూడలకు ఏలుక పాముల మందు, కోళ్లకు టీకా లు, గర్భకోశ వ్యాధుల నిర్ధారణ, చూడి పరీక్షలు, పెయ్యి దూడలు పుట్టే అధునాతన ఇంజెక్షన్లపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. పశువులు త్వరగా గర్భధారణ పొందడానికి అవసరమైన మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం సుమారు 84 పశువులకు, 250 మేకలు, గొర్రెలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో కొల్లిపర మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.సాయిసతీష్ రాజ్, చక్రాయపాలెం గ్రామం పశువైద్యాధికారి డాక్టరు నవ్య, తూములూరు గ్రామ పశువైద్యాధికారి డాక్టరు షేక్.ఎం.సుభానీ సాహెబ్, పాడి రైతులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌తో గర్భాశయ క్యాన్సర్‌కు చెక్

అవగాహన సదస్సులో గైనకాలజిస్ట్–ఇన్‌ఫెర్టిలిటీ నిపుణురాలు డాక్టర్ డీవీకే హరిణి



డాక్టర్ హరిణికి సత్కారిస్తున్న అతిథులు

తెనాలి: స్త్రీలలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు పలు కారణాలు ఉన్నాయని గైనకాలజిస్ట్–ఇన్‌ఫెర్టిలిటీ నిపుణురాలు డాక్టర్ డీవీకే హరిణి వెల్లడించారు. హ్యూమన్ పాపిల్లోమ వైరస్, మెనోపాజ్, చిన్న వయసులోనే పెళ్లి, వివాహేతర సంబంధాలు, ధూమపానం, పరిశుభ్రతను పాటించకపోవటం క్యాన్సర్‌కు దారితీస్తాయని చెప్పారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజిలో సోమవారం గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఆసియా ఖండంలోనే రెండో ప్రమాదకారిగా ఉన్న ఈ క్యాన్సర్‌పై డాక్టర్ హరిణి మాట్లాడారు. వ్యాధికారకాలు, లక్షణాలు, నిర్ధారణ,వ్యాక్సినేషన్ గురించి తెలియచేశారు. 9–13 ఏళ్ల వయసులోపు బాలికలు వాక్సినేషన్ తీసుకుంటే క్యాన్సర్ బారిన పడకుండా ఉండే అవకాశం ఉందన్నారు. పదిహేనేళ్ల పైబడిన వారూ వాక్సినేషను తీసుకోవచ్చనీ, అయితే ప్రతి అయిదేళ్లకు ఒకసారి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అనంతం ఫార్మసీ విద్యార్థుల సందేహాలకు సమాధానాలిచ్చారు. అనంతరం డాక్టర్ హరిణిని సత్కరించారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఐపీఏ–ఎస్ఎఫ్ మెంటర్స్ జి.నంద గోపాలకృష్ణ, పి.భార్గవి పర్యవేక్షించారు.

రాజ్యాంగంపై బీజేపీ అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న నాయకులు

తెనాలి: భారతీయ జనతా పార్టీ తెనాలి అసెంబ్లీ నియోజకవర్గంలోని నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు బూత్ కమిటీ అధ్యక్షులతో సోమవారం సాయంత్రం 'రాజ్యాంగ సంవిధాన్ దివాస్' సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక నూకల రామకోటేశ్వరరావు కల్యాణ కళాసదనంలో జరిగిన సమావేశానికి బీజేపీ తెనాలి అసెంబ్లీ కన్వీనర్ కఠారి వాసు దేవనాయుడు అధ్యక్షత వహించారు. బీజేపీ సీనియర్ నాయకురాలు యడ్లపాటి స్వరూపారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాజ్యాంగంపై అవగాహన, రాజ్యాంగ అమలుపై భారతీయ జనతాపార్టీకి గల చిత్తశుద్ధిని తెలియజేశారు. పార్టీ తెనాలి రూరల్ మండల ప్రెసిడెంట్ కడియాల నందకిషోర్, 3వ పట్టణ అధ్యక్షుడు యర్రంరాజు సందీప్‌రాజు గారు, కొల్లిపర మడల అధ్యక్షుడు మంద్రు మురళీ, మందా జనార్దన్, బిట్రా కనకదుర్గ, గాణ కళావతి, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

బాలకోటయ్య తిరునాళ్లు విజయవంతం చేయాలి

తహసీల్దార్ శ్రీనివాసరావు



సమీక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అరవపల్లిలో వేంచేసియున్న బాలకోటేశ్వర స్వామి తిరునాళ్లను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా అరవపల్లి బాలకోటేశ్వరస్వామి తిరునాళ్లపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరునాళ్లకు పాత గుంటూరు జిల్లాతో పాటు పాత కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. రేపల్లె నుంచి అరవపల్లికి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయటంతో పాటు గ్రామంలో బస్సులను నిలుపుకునేందుకు స్థలాన్ని పరిశీలించాలన్నారు. పోలీసు అధికారులు తిరునాళ్లలో ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. భక్తులను అప్రమత్తం చేస్తూ దొంగతనాలకు తావు ివ్వకుండా సిబ్బందితో నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు వైద్యసేవలు అందించేందుకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా పశు వైద్యాధికారులు సైతం అందుబాటులో ఉండి పశు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది ఆలయ సమీపంలో నీటితో నింపిన ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. తిరునాళ్ల మహోత్సవాలకు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయం వద్ద ఉచిత ప్రసాదం స్టాళ్లను ఏర్పాటు చేయదలిస్తే ముందుగా ఆలయ అధికారుల కుగానీ, తహసీల్దార్ కార్యాలయంలోగానీ అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.శోభారాణి, ఆలయ కార్యనిర్వహణాధికారి దివి అప్పలాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

నిజాంపట్నం: మండలంలోని ముత్తుపల్లి జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు స్కూల్ పూర్వపు ఉపాధ్యాయిని మెరుగుపాల కమలకుమారి సోమవారం చేయూతనిచ్చారు. పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తించిన కమలకుమారి తన తల్లి శేషమ్మ జ్ఞాపకార్థం పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు స్టీలు ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వనజాక్షి, మాజీ సర్పంచ్ మెరుగుపాల సలీమ్, ఉపాధ్యాయులు నాగబసవయ్య, నాగరాజు, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు లారీ ఢీ



కొల్లూరు : ఆర్టీసీ బస్సు, ఓ లారీ ఇరుకైన మార్గంలో ఒకదానికి ఒకటి ఢీ కొన్న ఘటన కొల్లూరు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రేపల్లె డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి కొల్లూరు వైపు వస్తుంది. అదే సమయంలో కరకట్టపైన కొల్లూరు వైపు నుంచి ఇటుకరాయి లోడ్‌తో లారీ వెళుతుంది. కరకట్టపైన వాహనం తప్పుకోవడానికి సైతం వీలు లేని ఇరుకైన మార్గం కావడంతో రెండు వాహనాలు ఒకదానికి ఒకటి ఎదురై పక్క నుంచి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆర్టీసీ బస్సు కుడివైపున లారీ చక్రం బోల్టులకు తాకింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు స్వల్పంగా ధ్వంసమైంది. ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కొల్లూరు సమీపంలో ఎదురెదురు వాహనాలు తప్పుకునే వీలులేకుండా ప్రమాదకరంగా ఉన్న కరకట్టను తక్షణం విస్తరించి ప్రమాదాలను నివారించాలని స్థానికులు ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో సంగం జాగర్లమూడి సర్పంచ్

తెనాలిరూరల్: ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో మండలంలోని సంగం జాగర్లమూడి గ్రామ సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి పాల్గొన్నారు. ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ప్రత్యేక ఆహ్వానం రావడంతో జయనాగలక్ష్మి అక్కడ జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఢిల్లీలో తమ గ్రామానికి గుర్తింపు రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తెనాలిరూరల్: భార్య కాపురానికి రావడంలేదన్న మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం క్రాప గ్రామానికి చెందిన పట్టాభి అరుణ్‌కుమార్ (28)కు నాలుగు నెలల క్రితం వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య పుట్టింటికి వెళ్లిపోయి కాపురానికి రావడంలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 23వ తేదీన తెనాలిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందగా, వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ ఎస్ఐ నక్కా ప్రకాశరావు తెలిపారు.

మైనర్ బాలిక, వివాహిత అదృశ్యం

తెనాలిరూరల్: వేర్వేరు ఘటనల్లో మైనర్ బాలిక, వివాహిత అదృశ్యమవడంపై కేసులు నమోదయ్యాయి. పట్టణ గురవయ్య కాలనీకి చెందిన ఓ మైనర్ బాలిక ఆదివారం నుండి కనబడడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. అలానే అదే కాలనీకి చెందిన వివాహిత శైలజ అదృశ్యమైందని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్ టౌన్ పోలీసులు రెండు కేసులను సోమవారం నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దంపతుల మధ్య స్వల్పవివాదం

తెనాలిరూరల్: స్వల్ప వివాదం నేపథ్యంలో భార్యకు నిప్పంటించబోయిన భర్తపై కేస నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోపల్లెకు చెందిన రమావత్ రవి తన ఆటోను కుదువ పెట్టి రావడంతో భార్య శ్రీదేవి ప్రశ్నించింది. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఇంట్లో ఉన్న టర్పెంటైన్ ఆయిల్‌ను భార్య, కుమార్తెపైకి చల్లాడు. నిప్పంటించబోగా, కుమార్తె తప్పించుకుంది. శ్రీదేవికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

సహాయ సంచాలకులు నాంచారయ్యకు సత్కారం

రేపల్లె రూరల్: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ వెంకట మురళీ చేతుల మీదగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు బెల్లంకొండ నాంచారయ్యను డివిజన్ పరిధిలోని పశు వైద్యులు పట్టణంలోని పశు వైద్యశాలలో సోమ వారం సత్కరించారు. పశువులకు సకాలంలో వైద్య సేవలు అందించటంతో పాటు వరదల సమయంలో వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి పశువులకు ప్రాణనష్టం జరగకుండా చూసుకోవటమే కాకుండా పచ్చిగడ్డి కొరత సమయంలో తన సొంత ఖర్చులతో 14 ట్రాక్టర్‌ల వరిగడ్డిని వరద ప్రభావిత ప్రాంతాలలోని పాడి రైతులకు అందించారు. ఈ నేపథ్యంలో నాంచారయ్య పుర స్కారాన్ని అందుకోవటం ఆనందంగా ఉందని పలువురు పశు వైద్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రేపల్లె మండల పశు వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, బొబ్బర్లంక పశు వైద్యాధికారి మీనాక్షి దేవి, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవివాహిత ఆత్మహత్య



మాధురి (ఫైల్)

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి నగరపరిధిలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి నగర పరిధిలోని కొత్తపేటలో నివాసముంటున్న కుర్రా మాధురి (33) సోమవారం ఉదయం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మాధురి గత కొంతకాలం క్రితం పట్టణ నగర పరిధిలోని ఓ మెడికల్ షాపులో పనిచేసింది. ఆదివారం రాత్రి భోజనం చేసి, బాగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలను విచారిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు.